నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: అంకుషాపూర్ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మాదారం 11కేవీ ఫీడర్ పరిధిలో గురువారం మరమ్మతుల కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు. మాదారం గ్రామం, వ్యవసాయ ఫీడర్, ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం గంట వరకు, అలాగే ఎదులాబాద్ 11కేవీ ఫీడర్ వ్యవసాయ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మేడ్చల్: మరమ్మత్తుల కారణంగా బుధవారం గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. గుండ్లపోచంపల్లి, మైసమ్మగూడ, నైబర్‌హుడ్,అపరెల్ పార్క్, అపర్ణ, లక్ష్మీనగర్, కాజాగూడ, మాణిక్యరెడ్డినగర్, కాలనీలలో ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

కీసర: నేడు(గురువారం) అంకిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ మరమ్మత్తు పనుల కారణంగా గురువారం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు అంకిరెడ్డిపల్లిగ్రామం, తాతా ఆసుపత్రిఏరియా, కెజిఎఫ్ మెయిన్‌రోడ్డులో విద్యుత్ అంతరాయం ఉంటుందని కీసర ఏఈ తెలిపారు.

డబీల్‌పూర్‌ను నెంబర్ వన్‌గా నిలిపారు



డబీల్‌పూర్ పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంపీపీ రజితరెడ్డి

మేడ్చల్: గత ఐదేళ్ళలలో డబీల్‌పూర్ గ్రామ పంచాయతీని గ్రామ పంచాయతీ పాలకవర్గం మండలంలో అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలిపారని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సన్మాన కార్యక్రమంలో పాల్గొని పదవీ కాలం ముగుస్తున్న పాలకవర్గ సభ్యులను, సర్పంచ్ గీత భాగ్యారెడ్డి ని సన్మానించారు. సర్పంచ్ గీత నేతృత్వంలో అనేక అభివృద్ధి పథకాలు చేపట్టి జాతీయ స్థాయిలో అవార్డు గెలుచుకున్నారనిఅన్నారు కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యనారయణ, ఎంపిటీసీ హేమలత, నాయకులు భాగ్యారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర గృహ కార్మికుల యూనియన్ ఎన్నిక

రామంతాపూర్ : తెలంగాణ రాష్ట్ర గృహ (ఇండ్లలో పని చేసే) కార్మికుల రాష్ట్రస్థాయి సమావేశం బుధవారం స్థానిక మౌంట్ పోర్టు సోషల్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్ టేక్‌నాథ్ తెలంగాణ ఆంధ్ర క్రో కార్మికుల యూనియన్ కో ఆర్డినేటర్ సిస్టర్‌లు ఉన్నారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్ మాట్లాడుతూ ఇండ్లల్లో పని చేసే కార్మికులు వారంలో ఒక రోజు సెలవుతో పాటు గృహ కార్మికుల భద్రత కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. అనంతరం నిర్వహించిన గృహ కార్మికుల రాష్ట్ర స్థాయి యూనియన్‌కు అధ్యక్షురాలుగా వల్లాల మంజుల, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ శోభ, కోశాధికారిగా మాధురి ఎన్నికయ్యారు.

ప్రణాళికాబద్ధంగా డ్రైనేజీ లైన్లు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ప్రణాళికబద్ధంగా అవసరమైన చోట భూగర్భడ్రైనేజీ లైన్లను ఏర్పాటు చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నాచారం వీఎస్టీ కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతపైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్ లైన్‌లను అవసరమైన చోట పతిపాదనలు తీసుకొని పనులు చేపడుతున్నామ న్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్. మేనేజర్ సందీప్, నాచారం బీఆర్ఎస్ నేతలు. వీఎస్టీ కాలనీ వెల్ఫేర్ ఆసోసియేషన్ సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

దారి మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: నాచారం అన్నపూర్ణ కాలనీలోని వెస్లీ కో ఎడ్యుకేషన్ పాఠశాల వెళ్లే దారి మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నాచారం డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు బుధవారం కాప్రా డిప్యూటీ కమీషనర్ ముకుంద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నూతలకంటిరాజు. నమిలికొండ సునీల్‌రెడ్డి, గద్దక్రాంతి కిషోర్, మహేష్ యాదవ్, బాలు యాద వ్, బాలరాజు, అబ్రహాం, నరేష్ తదితరులు ఉన్నారు.

కటార్ల శేఖర్ బాబుకు డాక్టరేట్

మల్లాపూర్: మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీకి చెందిన కటార్ల శేఖర్‌బాబుకి ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చర్ రిసేర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. స్ఫూర్తి సర్వీస్ సోసైటీ ఇండియా ఎన్జీవో ఆధ్వర్యంలో డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. పంచాయతీ రాజ్ శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ యాదయ్యగౌడ్, స్ఫూర్తి సర్వీస్ సోసైటీ ఇండియా ఎన్జీవో ఫౌండర్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్, సురభీ శ్రీధర్‌రావు, నరసింగ్ రావు చేతుల మీదుగా డాక్టరేట్‌ను కటార్ల శేఖర్ బాబు అందుకున్నారు. అనంతరం కటార్ల శేఖర్ బాబు మాట్లాడుతూ తన సేవాలను గుర్తించి డాక్టరేట్ ను ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు పద్ధతి కాదు

అల్వాల్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఎంతో కృషి చేసిన ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీ కాకుండా అడ్డుకోవడం సరికాదని తెలంగాణ జన సమితి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల దయాకర్ అన్నారు. బుధవారం అల్వాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ పదవిని ప్రమాణస్వీకారాన్ని బీఆర్ఎస్ నాయకులు న్యాయస్థానానికి వెళ్లి అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గ జన సమితి నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాస్ సురేష్, రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులకే సహకరిస్తున్న ఎస్ఐ

మహిళా కానిస్టేబుల్ నాగమణి ఆవేదన

మేడిపల్లి: తన ఇంటిని కొందరు నకిలీ డాక్యుమెంట్లతో కబ్జా చేశారని, మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎస్ఐ శివకుమార్ నిందితులకే మద్దతు పలుకుతున్నాడని కాలాపత్థర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణి వాపోయింది. బోడుప్పల్‌లో తన ఇంటిని కొందరు కబ్జాచేశారని పిర్యాదు చేస్తే బాధితురాలైన తనను పట్టించుకోవడం లేదని మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళణ వ్యక్తం చేసింది. మేడిపల్లి ఎస్ఐ.. తనతల్లి, భర్తను కొట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. 8 నెలలుగా తనకు న్యాయం జరగడం లేదని వాపోయింది. ఇదిలా ఉండగా కానిస్టేబుల్ నాగమణి కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎస్ఐ శివకుమార్ పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని వివరించారు.

పురపాలికల్లో ప్రగతి అధోగతి

- 5 నెలలుగా విడుదల కానినిధులు
- 29 పురపాలికల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు నగరాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగైన పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'పట్టణ ప్రగతి' నిధులు మంజూరు చేస్తోంది. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తున్నారు. ఆ మొత్తంతో అత్యవసర పనులు, సదుపాయాల కల్పనకు అధికార యంత్రాంగాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ముఖ్యంగా ఇరుకు రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ప్రకృతివనాలు, ఓపెన్ జిమ్, సమీకృత వెజ్-నాన్వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాల నిర్మాణాలతో పాటు ఉద్యానవనాలను తీర్చిదిద్దడం ద్వారా పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం పెంపొందుతోంది. వాల్ పెయింటింగ్, సూచికలు వంటి ఆకర్షణ పనులూ చేపడుతున్నారు. పథకం ఆరంభంలో నిధుల విడుదల పక్కాగా జరిగింది. కానీ, గతేడాది సెప్టెంబరు నుంచి వరుసగా ఐదు నెలలకు అందాల్సిన రూ.155 కోట్ల విడుదలపై ఆలస్యం జరుగుతుండటంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోంది.

అవసరాలు బారెడు.. ఆదాయం మూరెడు..

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల పరిధిలో 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. నల్లా కనెక్షన్, ఆస్తి, ఇతర పన్నుల ద్వారా ఏడాదికి దాదాపు రూ.365 కోట్ల ఆదాయం సమకూరుతోంది. హైదరాబాద్ మహానగరానికి సమాంతరంగా శివారు పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెట్టిన పురపాలికలు ..ఆమేరకు పనులు, కార్యక్రమాలు చేయలేకపోతున్నారు. అలాగే, కొన్ని పట్టణాల్లో సమయానికి పన్నులు కూడా వసూలు కావటం లేదు. ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు సృష్టికి అవకాశాలూ అంతంతమాత్రమే. మరోవైపు విద్యుత్తు దీపాలు, తాగునీటి పథకాల నిర్వహణకు విద్యుత్తు బిల్లులు, పారిశుద్ధ్య నిర్వహణ, అత్యవసర ఖర్చులు నెలకు రూ. లక్షల్లో ఉంటున్నాయి. వీటికి నెలవారీ ఆదాయాన్ని మించి ఖర్చు చేసే పరిస్థితి నెలకొంది. చివరకు సిబ్బంది, కార్మిక వేతనాల చెల్లింపులకు దిక్కులు చూడాల్సిన పరిస్థితి. పారిశుద్ధ్య, ఇతర అభివృద్ధి పనుల నిర్వహణ కష్టమవుతోంది. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద 'పట్టణ ప్రగతి'కి నెలవారీగా నిధులు వెచ్చిస్తుండగా.. అవి ఎంతో ఉపయోగపడుతున్నాయి. అవి ప్రస్తుతం సకాలంలో విడుదలకాక పోవడంతో పారిశుద్ధ్యం. స్వచ్ఛ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతోంది.

పేరుకుపోయిన సమస్యలు

పురపాలికల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఆదాయ మార్గంగా ఉన్న పన్నుల వసూలుపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోంది. సామాన్య మధ్య తరగతి ప్రజలకు నోటీసులు ఇచ్చి ముక్కు పిండి ఆస్తి పన్ను వసూలు చేసే పురపాలిక అధికారులు వ్యాపార వాణిజ్య సంస్థలు,పరిశ్రమలు ,విద్యాసంస్థల విషయంలో మాత్రం మెతక వైఖరి అనుసరిస్తున్నారు. పలు పురపాలక సంఘాల్లో ఆ సంస్థలు పన్ను బకాయి ఉన్నా.... ఏళ్ల తరబడిగా చెల్లించటం లేదని తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్సులు అంతే..

పురపాలికల నుంచి వ్యాపార, వాణిజ్య ట్రేడ్ లైసెన్సు తీసుకోవటం లేదు.... ఉన్న సంస్థలు వాటిని రెన్యూవల్ చేసుకొనకుండా నెట్టుకొస్తున్నారు.దీంతో పురపాలికల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పట్టణాల్లో వ్యాపార ,వాణిజ్య సంస్థలు,పరిశ్రమలు పెరుగుతున్నప్పటికిని,వాటికి తగ్గట్టుగా ట్రేడ్ లైసెన్సులు జారీ కావటం లేదు. ఉదారహారణకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాల పరిధిలో 17,056 వ్యాపార సముదాయాలు ఉన్నట్లు గుర్తించిన ప్పటికిని, 8,998 ట్రేడ్ లైసెన్సులను మాత్రమే జారీ చేశారు. బోడుప్పల్ పురపాలక సంఘంలో 2,035 వ్యాపార సముదాయాలు ఉండగా, ట్రేడ్ లైసెన్సులు పొందినవి 455 మాత్రమే ఉన్నాయి.అలాగే, నిజాంపేటలో 4,354 గానూ ,2,135, జవహర్‌నగర్‌లో 750కి 282, దుండిగల్‌లో 1248కి 432, కొంపెల్లిలో 1,047 గానూ 256, నాగారంలో 1,211గానూ 265, పోచారంలో 411 వ్యాపార సముదాయాలకు గానూ 173 షాపులకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులను జారీ చేశారు.

పన్నుల మదింపులోనూ చేతి వాటం...

పురపాలక సంఘాల్లో రెండు కంటే ఎక్కువ అంతస్తులు ఉన్న భవనాలకు కొలతలు చేసి పన్ను విధించాల్సి ఉండగా ...టౌన్ ప్లానింగ్ విభాగం ఆ పని సరిగ్గా చేయటం లేదు. ఈ కారణంగా పురపాలికలకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. పాలకవర్గ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం పురపాలక సంఘాల అభివృద్ధికి అవరోధంగా మారుతోంది. జిల్లాలోని పలు పురపాలక సంఘాల్లో పలువురు ఉద్యోగులు, ప్రతినిధులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై కలెక్టర్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ఉప్పల్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ ఎస్. శ్రీనివాస రావు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసాన్ని పురస్కరించుకుని బుధవారం ఉప్పల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ యాదవ్, ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణంరాజు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో కుక్కల బెడద



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో పలు కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాలనీల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. పిల్లలుగాని, పెద్దలుగాని రోడ్డుపైకి రావాలంటే భయ పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు జంకుతున్నారు. మల్లయ్యనగర్, అనుశ్రీనగర్, సాయి అనుశ్రీ కాలనీ, వాసవి నగర్ కాలనీల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని సామాజిక కార్యకర్త వీరమల్లు పాలకవర్గం, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

పాలన చేతకాక కేసీఆర్‌పై నిందలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి కి పరిపాలన చేతకాక మంత్రులు, ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఇతర నేతలపై నిందలు వేస్తున్నారని మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గత అసెంబ్లీ ఎనికనకల్లో మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించిన సందర్భంగా బుధవారం అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వేన్షన్‌లో కీసర, దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీల నాయకులతో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ రెండు నెలల పాలనలో ప్రతీ రోజు విద్యుత్ కొరత ఏర్పడుతుందని, కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను రెండు నెలలైనా నెరవేర్చకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.

సదరం క్యాంపులను వినియోగించుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ బోర్డు ద్వారా సదరం క్యాంపులను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి పద్మజారాణి తెలిపారు. ఫిబ్రవరి 8,15,22,29 తేదీల్లో నిర్వహించతలపెట్టిన సదరం క్యాంపులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు. అంగవైకల్యం,దృష్టి ,వినికిడి లోపం,మెంటల్ రిటార్డేషన్,మానసిక అనారోగ్యం కలిగి ఉన్న దివ్యాంగులు సదరం క్యాంపులో పాల్గొనవచ్చునన్నారు. సదరం క్యాంపునకు వచ్చే దివ్యాంగులు వారి వెంట, మీ సేవ ద్వారా బుక్ చేసుకున్న సదరం స్లాట్, ఆధార్ కార్డు, ఫోటో, మెడికల్ రిపోర్ట్‌తో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సదరం స్లాట్స్ అందులో ఉంటాయన్నారు.

చేసిన పనికి డబ్బు అడిగితే ఇంత నిర్లక్ష్యమా?

ఆరు గ్యారంటీల దరఖాస్తులు డేటాఎంట్రీ చేసిన యువకులు ఆగ్రహం

ఉప్పల్: ప్రజాపాలన ఆరు గ్యారెంటీలకు డేటా ఎంట్రీ చేసిన యువకులు డబ్బులు అందక పోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారులు పని చేయించుకుని డబ్బు అడిగితే నిత్యం రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని డేటా ఎంట్రీ ఆపరేటర్లు బోరు మంటున్నారు. ఇచ్చే డబ్బు కనీసం ఖర్చులకు వస్తాయోమోనని ఆశ పడితే తిరగడమే సరిపోతుందని వాపొతున్నారు. ఇదే విషయంపై బుధవారం ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌ను డేటా ఎంట్రీలు డబ్బుల విషయం అడగగా రాలేదు వచ్చినప్పుడు ఇస్తాం.. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ నిర్లక్ష్య సమాదానం చెప్పడంపై వారు భగ్గుమన్నారు. గత నెల 17న డబ్బు ఇస్తామన్నారు. పని పూర్తవ్వగానే అకౌంట్స్‌లో డబ్బులు వేస్తామని ఇంకా వేయక పోవడంతో బాదితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని డేటా ఎంట్రీలకు పని డబ్బులు ఇప్పించాల్సిందిగా వారు కోరుతున్నారు.

> **ఆందోళన వద్దు..**
>
> పని చేసిన డబ్బుల గురించి ఎవ్వరు ఆందోళన చెందవద్దు. డబ్బులకు సంబందించిన ఫైల్‌ను ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపాం. సాధ్యమైనంత త్వరలోఎవ్వరి అకౌంట్స్‌లో వారికి డబ్బులు వేస్తాం. ఆందోళన అవసరం లేదు.
>
> – ఉప్పల్ ఉపకమిషనర్ శ్రీనివాస్

డిగ్రీ కళాశాల భవనానికి స్థలం కేటాయించాలి



సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: ఉప్పల్ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం కావాలని కోరుతూ ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేసారు. ఉప్పల్‌లో భవనం లేకుండానే డిగ్రీ కళాశాల కేటాయించడంతో విద్యార్థులు, అవస్థలు పడుతున్నారని గతంలో ఎన్ని లిఖిత పూర్వక ఫిర్యాదులు ఇచ్చినా అధికారులు, పాలకులు పెడచెవిన పెట్టారని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో మంగళవారం సాయంత్రం కార్పొరేటర్ రజిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఇక్కడి పరిస్థితులు వివరించారు. ఉప్పల్ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మాణానికి భగాయత్‌లో ఐదు ఎకరాల స్థలంతో పాటు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసారు.

రేపు కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


కీసర: ఈనెల 2న(శుక్రవారం) కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గ్యామనాయక్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఆయాగ్రామాల ఎంపీటీసీసభ్యులు, వివిధశాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయనకోరారు.

బస్టాండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామంలో బస్‌స్టాండ్‌ను బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీ, గ్రామ పంచాయతీ నిధులు రూ. 7 లక్షలతో నిర్మించి బస్ స్టాండ్ (ప్రయాణ ప్రాంగణం) ను మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ యెల్ళు బాయి, జెడ్పీటీసీ అనిత, సర్పంచ్ సుకన్య, పలువురు వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మాధురి (ఫైల్)

జవహర్‌నగర్: మహిళ అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కాప్రా జమ్మిగడ్డ బీజేఆర్‌నగర్‌లో నివసించే కటకం వేణుకుమార్, భార్య కటకం మాధురి (30) ఇద్దరు కుమారులతో ఉంటున్నారు. ఈ నెల 18న మాధురి పిల్లలను ట్యూషన్‌కు పంపించి వస్తానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోట వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

అల్వాల్: నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పి.సందీప్‌కుమార్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

శ్రీబాలాజీ వెంకటేశ్వర ఆలయం హుండీ లెక్కింపు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వర ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.5,89,746 వచ్చిందని ఆలయ చైర్మన్ రాజా సంజయ్‌గోపాల్ సహించర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.వీరేశం, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, వెంకన్న, రామచంద్రరావు, సురేందర్‌రెడ్డి, శివరామకృష్ణ, నాగేష్, ఆలయ సిబ్బంది నరసయ్య పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై కార్పొరేటర్ సమీక్ష

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో పెండింగ్ పనులపై ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కార్పొరేటర్ శ్రవణ్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే నిధులు మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులు ఎప్పటిలోపు పూర్తి చేస్తారో టైం బాండ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కాంట్రాక్టర్ల నుండి ఇబ్బందులు తలెత్తితే వారితో మాట్లాడతానన్నారు. సమావేశంలో డీఈ మహేష్, ఏఈ దీపక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎంపీ ల్యాడ్స్ మార్చి కల్లా వినియోగించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని ఎక్కడ కూడా పెండింగ్‌లో ఉండకుండా చూడాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. పనులకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక అధికారి (సీపీవో) మోహన్ రావుతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్) పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (ఎంపీ ల్యాడ్స్), క్రుషియల్ బ్యాలెన్స్‌డ్ ఫండ్ (సీబీఎఫ్),ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్డీఎఫ్)పై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయడానికి ఆస్కారముంటుందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్‌కు సంబంధించి మార్చి 31 వరకు పూర్తి చేయాలని, ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని పేర్కొన్నారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి నిధులతో పాటు ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్డీఎఫ్)కు సంబంధించిన పనులు ఫిబ్రవరి చివరి కల్లా పూర్తి చేయాలన్నారు. అలాగే, అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని ప్రత్యేకంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పనులు చేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని,అలాగే, ఆ పనులను ఇతరులకు అప్పగిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల కోసం అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. మరో 15 రోజుల తర్వాత మళ్లీ సమావేశాన్ని నిర్వహిస్తామని, అప్పటి వరకు అభివృద్ధి పనులు పూర్తయ్యేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాస్‌మూర్తి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీదేవి,డీఆర్డీఏ పద్మజారాణితోసహా డీఎఫ్ఓ, డీడబ్ల్యువో, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

దాతల సాయంతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం



ఘనాపూర్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులను సత్కరిస్తున్న కార్యదర్శి సునీత

ఘట్‌కేసర్: దాతల సాయంతో గ్రామాన్ని అభివృద్ధి చేశామని సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి అన్నారు. ఘనాపూర్ పంచాయతీ కార్యలయంలో కార్యదర్శి సునీత ఆధ్వర్యంలో బుధవారం వీడుకోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి మొమెంటో అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేశామని, సహకరించిన పాలకవర్గం, ప్రజలకు ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, వార్డు సభ్యులు భాస్కర్, పద్మ, కాంతమ్మ పాల్గొన్నారు.

కాచవానిసింగారంలో...

కాచవానిసింగారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొంతం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పారదర్శకంగా అభివృద్ధి చేశామని, సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి పాలకవర్గ సభ్యులను సత్కరించారు.

ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతి



గద్దర్ జయంతి వేడుకల్లో పాల్గన్న నేతలు



వెంకటాపురంలో..

అల్వాల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలు బుధవారం వెంకటాపురం అంబేద్కర్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన సతీమణి విమల గద్దర్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశ సాంస్కృతిక ఉద్యమ చరిత్రలో నింగికెగిసిన ధృవతార గద్దర్ అని, ఆయన గత 50 సంవత్సరాల నుండి బహుజనుల కోసమే తన ఆటపాటల ద్వారా, కళా ప్రదర్శన ద్వారా ప్రజలను చైతన్య పరిచిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సీఎల్.యాదగిరి, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె. అక్సర్, శంకర్, చిట్టిబాబు పాల్గొన్నారు.

వెంకటాపురంలో గద్దర్ జయంతి

అల్వాల్: ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలు వెంకటాపురంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు అనిల్‌కిషోర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి గద్దర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, స్వామి, వెంకటయ్య, బాబు, రాజు, రాంచందర్, ప్రభాకర్, శ్రీనివాస్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాదమ్మనగర్‌లో...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం యాదమ్మనగర్‌లో గద్దర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ-బ్లాక్ అల్వాల్ సర్కిల్ అధ్యక్షులు నిమ్మ అశోక్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, కృష్ణగౌడ్, సంజీవ్‌కుమార్, శివశంకర్, నరేష్, శేఖర్, సాయికుమార్, సదానందం, నందకుమార్, జగన్‌గౌడ్, కిరణ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.